క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్మాణ కమిటీకి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, దాత సన్యాసిరావు

లక్కవరపుకోట: మండలంలోని కుర్మవరంలో గ్రామదేవత నూకాలమ్మ వారి ఆలయ నిర్మాణానికి మల్లివీడు గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త బోని సన్యాసిరావు(సన్ని) రూ.25 వేల విరాళం ప్రకటించారు. నగదును ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు ఎల్.కోటలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి నివాసంలో ఆమె చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. దాతను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోళ్ల రామ్‌ప్రసాద్, శ్రీనాథు పెదబాబు, కుర్మవరం వైస్ సర్పంచ్ దాలినాయుడు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ మహేష్

బొండపల్లి: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ యు.మహేష్ హెచ్చరించారు. మండల కేంద్రంలో జాతీయ రహదారి–26పై పోలీస్ సిబ్బందితో కలిసి ఆదివారం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన చోదకుల లైసెన్స్, వాహనాల పత్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే రూ.10 వేల వరకు జరిమానా విధిస్తామని చెప్పారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరామర్శ



రాములమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య, తదితరులు

గంట్యాడ: మండలంలోని కొత్తవెలగాడ మాజీ సర్పంచ్ చొడువాడ రామసూర్యం తల్లి రాములమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆదివారం కొత్తవెలగాడ వెళ్లి రాములమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాములమ్మ చిత్రపటం వద్ద జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, నాయకులు వేమలి ముత్యాలనాయుడు తదితరులతో కలిసి నివాళులర్పించారు.


కనకమహాలక్ష్మికి అభిషేకాలు



అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ అమ్మవారికి ఆదివారం పంచామృతాభిషేకాలు చేశారు.అనంతరం అమ్మవారిని అలంకరించి, భక్తులను దర్శనానికి అనుమతించారు.మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

వైద్య ఖర్చులకు సహాయం



బాధితురాలి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న జాయినింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు

కొత్తవలస: మండలంలోని కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధి జి.ఎస్.ఎన్.రాజునగర్‌కు చెందిన ముక్కవల్లి నాగమణి అనారోగ్యంతో కొంత కాలంగా మంచానికే పరిమితమయ్యారు. వైద్యఖర్చులకు ఇబ్బంది పడుతుండడంతో విషయం తెలుసుకున్న నిమ్మలపాలెం గ్రామానికి చెందిన జాయినింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు గొంప రాంబాబు, చీపురపల్లి సాగర్‌కల్యాణ్ స్పందించారు. బాధితురాలి వైద్యఖర్చుల కోసం జాయినింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా ఆదివారం రూ.10వేల ఆర్థిక సహాయం చేశారు. దాతలకు బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పల్లెలపై డయేరియా పంజా

- గుర్ల మండలంలో అదుపులోకి రాని డయేరియా
- శనివారం నాటికి 450కు పైగా కేసులు నమోదు
- ఇప్పటి వరకు 11 మంది మృతి
- ఆదివారం వ్యాధి బారిన పడిన మరో 15 మంది
- వ్యాధి తగ్గాలని గ్రామదేవతలకు పూజలు



నాగళ్లవలస సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న యువకుడు

గుర్ల: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో డయేరియా పంజా విసురుతోంది. రోగులు, మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడం ప్రజలను కలవరపెడుతోంది. వ్యాధి బారినపడుతున్న వారిలో ఎక్కువగా వృద్ధులే ఉండడం, వారి ఆరోగ్య పరిస్థితి విషమిస్తుండడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. శనివారం నాటికి మొత్తం 450కు పైగా కేసులు నమోదు కాగా, 11మంది మృతిచెందారు. ఆదివారం మరో 15 కేసులు బయటపడ్డాయి. 350 మంది వరకు ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్యశిబిరాల్లో చికిత్స పొందగా, వందమంది వరకు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించారు. వీరిలో 64 మంది ఇంకా చికిత్స పొందుతున్నారు. తాగునీటి కలుషితం వల్లే వ్యాధి ప్రబలుతోందని అధికారులు చెబుతున్నారు. మండలంలోని ఉన్న కొండపాలెం రక్షిత మంచినీటి పథకం ద్వారా మండలంలోని 26 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. ఈ గ్రామాల్లోనే ఎక్కువగా డయేరియా బాధితులు ఉన్నారు. మండల కేంద్రం గుర్లలో అయిదుగురు, నాగళ్లవలసలో ఎనిమిది మంది, కెల్ల గ్రామంలో ఇద్దరు ఆదివారం డయేరియా బారినపడ్డారు. వీరిలో నలుగురు గుర్ల పీహెచ్‌సీలో, ముగ్గురు నెల్లిమర్ల సీహెచ్‌సీలో, ఇద్దరు చీపురుపల్లి సీహెచ్‌సీలో, ముగ్గురు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా, నాగళ్లవలస సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో మరో ముగ్గురికి వైద్యులు వైద్యం అందిస్తున్నారు. సచివాలయంలో సిబ్బంది రోగులకు బెంచీలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఇళ్ల వద్ద నుంచే నులక మంచాలను తెచ్చుకుని వాటిపైనే వైద్యం చేయించుకున్నారు.

అధ్వానంగా పారిశుద్ధ్య నిర్వహణ

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వాన్నంగా తయారైంది. డయేరియా కేసులు నమోదు కావడంతో నాగళ్లవలస, కెల్ల గ్రామాల్లో అధికారులు హడావుడిగా పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారు. నాగళ్లవలసలో ఎప్పటినుంచో పారిశుద్ధ్య పనులు చేపట్టలేదని, గ్రామంలో డయేరియా బయటపడడంతో అధికారులు మేల్కొని పారిశుద్ధ్య పనులు ప్రారంభించారని గ్రామస్తులు అంటున్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

గ్రామాల్లో డయేరియా విజృంభిస్తుండడంతో గుర్ల, గోషాడలో గ్రామపెద్దల ఆధ్వర్యంలో గ్రామదేవతలకు ఆయా గ్రామాల ప్రజలు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు.గ్రామ దేవతలకు పసుపు, కుంకమ సమర్పించి రోగాలు రాకుండా చూడు తల్లి అంటూ వేడుకున్నారు. పూజల అనంతరం ప్రతి ఇంటి నుంచి వేపచెట్టు కొమ్మలు, చేటలు, చీపుర్లు, ఇతర వస్తువులను సేకరించి గ్రామానికి నాలుగు దిక్కుల్లో వాటిని ఉంచి సురక్ష రేఖ కడుతున్నారు. సురక్ష రేఖ కట్టడం వల్ల అమ్మవారు శాంతించి వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని గ్రామస్తులు నమ్మకంగా భావిస్తున్నారు.

పెనుబర్తిలో వైద్యశిబిరం



గుర్ల: పెనుబర్తిలో వైద్యసేవలందిస్తున్న కాష్వి ఆస్పత్రి సిబ్బంది



మెరకముడిదాం: గర్భాంలో వృద్ధులకు నేత్ర పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ వివేక్‌వర్మ

గుర్ల: మండలంలోని పెనుబర్తి గ్రామంలో విజయనగరం కాష్వి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు తుమ్మగుంటి పరమేష్ తెలిపారు.శిబిరంలో వంద మందికి వైద్యురాలు శ్రీవిద్య, వైద్య సిబ్బంది వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.అలాగే సాయి భజన మండలి ఆధ్వర్యంలో నేత్రవైద్య శిబిరం ఏర్పాటు చేశారు.శిబిరంలో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సిబ్బంది సేవలందించారు. శిబిరాలను స్థానిక నేతలు మండల అప్పలనాయుడు, రెడ్డి అచ్యుతరావు, గుషిడి సూర్యారావు సందర్శించారు.

గర్భాంలో..

మెరకముడిదాం: మండలంలోని గర్భాం పీహెచ్‌సీలో శంకర్‌ఫౌండేషన్, సహాయస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఆప్తాలమిక్ బి.వివేక్‌వర్మ 68 మందికి కంటి పరీక్షలు చేసి 59 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి కంటి ఆపరేషన్లు చేసేందుకు విశాఖపట్నంలో శంకర్‌ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. ఆయా ఫౌండేషన్‌ల ప్రతినిధులు సాయికుమార్, సాయిరేవంత్, సురేష్, సతీష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కోలాటం గ్రూపునకు మైక్‌సెట్ వితరణ



కోలాటం గ్రూపు సభ్యులకు మైక్‌సెట్ అందజేస్తున్న ఎంపీపీ వెంకటనర్సమ్మ, అనంతం

చీపురుపల్లి: మండలంలోని రామలింగాపురం గ్రామంలో కోలాటం ప్రదర్శించే మహిళలకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ దంపతులు తమ సొంత నిధులు రూ.20 వేలతో మైక్‌సెట్ కొనుగోలు చేసి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోలాటం చక్కగా ప్రదర్శిస్తూ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మాజీ సర్పంచ్ కంది అప్పారావు, శిరేల రాములు, కంది త్రినాథ్, కంది శ్రీరాములు, జమ్ము అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయసమ్మేళనం



అలమండ హైస్కూల్ 1985-86 బ్యాచ్ పదోతరగతి పూర్వవిద్యార్థులు

జామి: మండలంలోని అలమండ ఉన్నత పాఠశాలలో 1985–86 సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆ పాఠశాల వేదికగా ఆదివారం నిర్వహించారు. 38 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, కుటుంబం జీవితం గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. తమ మిత్రుల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

రూ.లక్ష ఆర్థిక సహాయం

చీపురుపల్లి: పట్టణానికి చెందిన ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన వైద్యఖర్చుల కోసం చీపురుపల్లి నియోజకవర్గ తూర్పుకాపు ఉద్యోగ సంక్షేమ సంఘం ఆదివారం రూ.లక్ష ఆర్థిక సహాయం చేసింది. ఆశయ సంస్థ ద్వారా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఎంతో మందిని ఆదుకున్న రమణ తీవ్ర గాయాలపాలవ్వడంతో ఆ సంఘంలో సభ్యులు చర్చించుకుని సహకారం అందించాలనుకున్నారు. సంఘంలో 87 మంది స్పందించి రూ.లక్ష నగదును ఫోన్‌పే ద్వారా ఆ సంఘం ప్రతినిధికి పంపించగా, ఆ మొత్తాన్ని రమణ కుటుంబానికి అందజేశారు.

రేపటి నుంచి ఆధార్ క్యాంపులు

బొండపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఈనెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.గిరిబాల ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఆధార్ కార్డుల అప్‌డేట్‌తో పాటు, మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈఅవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేటి కార్యక్రమాలు

గొట్లాంలో సత్సంగం

బొండపల్లి: గొట్లాం గ్రామంలో షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ధ్యాన, జ్ఞాన సత్సంగం నిర్వహించనున్నట్లు పిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ వి.రామకృష్ణరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధ్యాత్మిక గురువు మారం శివప్రసాద్ ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నదానం, వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

లింగరాజపురంలో గ్రామసభ

దత్తిరాజేరు: రీసర్వే పూర్తయిన భూములకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు మండలంలోని లింగరాజపురంలో సోమవారం ఉదయం గ్రామసభ నిర్వహించనున్నట్లు సమగ్ర భూసర్వే డీటీ రత్నకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు గ్రామసభకు హాజరై, వినతిపత్రాలు అందజేయవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేయవచ్చని సూచించారు.

ఉపాధి నిధులతో సీసీరోడ్ల నిర్మాణం



చీపురుపల్లి: చీపురుపల్లిలోని గవిడివీధిలో భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



శృంగవరపుకోట: భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, తదితరులు



జామి: విజినిగిరిలో భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

చీపురుపల్లి: ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో సీసీరోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ చెప్పారు. చీపురు పల్లి మేజర్ పంచాయతీ పరిధి గవిడివీధిలో సీసీరోడ్డు పనులకు ఆమె జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, మేజర్ పంచాయతీ సర్పంచ్‌తో కలిసి ఆదివారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధిహామీ నిధులతో మంజూరయ్యే పనులను సర్పంచ్‌ల ఆధ్వర్యంలో చేపట్టాలని, బిల్లులు సర్పంచ్‌ల ఖాతాలోనే జమవుతాయన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, ఇప్పిలి గోవింద, గవిడి సురేష్, గిరడ రాందాసు, ముల్లు పైడిరాజు, కరణం ఆది, మీసాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

శృంగవరపుకోట: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా తిమిడి, వశి, వీరనారాయణం, ఎస్.కోట గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఆదివారం భూమిపూజ చేశారు. జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, ఎస్.కోట ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుబ్బలక్ష్మి, జనసేన ఇన్‌చార్జి ఒబ్బిన సత్యనారాయణ, సర్పంచ్‌లు డి.సంతోషికుమారి, ఒబ్బిన త్రినాథమ్మ, ఒబ్బిన పార్వతమ్మ, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ సతీష్,జేఈ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జామి మండలంలో...

జామి: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాండ్రంగి, విజినిగిరి, లొట్లపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మాణానికి ఎంపీడీఓ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఆదివారం భూమిపూజ చేశారు. ఈఓపీఆర్డీ జి.ఉమ, ఉపాధి హామీ ఏపీఓ కిరణ్మయి, సర్పంచ్‌లు కరక వందన, కిలారి సూర్యారావు, నాయకులు స్వామినాయుడు,పైడిరాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుల బృందం

శృంగవరపుకోట: పురుషులు, మహిళలు సీనియర్స్ విభాగంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు భవానీనగర్ వద్ద ఉన్న డాక్టర్ వరలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్స్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఎంపికలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు నవంబర్ 8,9,10 తేదీల్లో నంద్యాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ లక్ష్మణరావు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులకు వరలక్ష్మి పీఈటీ కళాశాల వ్యవస్థాపకురాలు డాక్టర్ పి.వరలక్ష్మి, సిద్ధూలు క్రీడాకారులకు రవాణా ఖర్చుల కోసం రూ.5000 అందజేశారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, సిద్ధూ క్రీడాకారులకు టీషర్టులు అందజేస్తామని చెప్పారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రవికుమార్, సతీష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ నవీన్‌పడాల్

లక్కవరపుకోట: అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ నవీన్‌పడాల్ ప్రజలకు సూచించారు.మండలంలోని భీమాళి గ్రామస్తులతో ఆదివారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కొంతమంది బైకులపై గ్రామాల్లో సంచరిస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు అనుమానస్పదంగా సంచరిస్తూ కనిపిస్తే పోలీసులకు మాచారం అందజేయాలన్నారు. అలాగే సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయని, అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవద్దన్నారు. బ్యాంకు ఖాతాల వివరాలు, ఏటీఎం పిన్ నంబర్లను తెలియని వ్యక్తులకు చెప్పవద్దని సూచించారు.

పారిశుద్ధ్య పనులు

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట గ్రామ సచివాలయం–2 పరిధిలో ఇన్‌చార్జి పంచాయతి కార్యదర్శి తిరుపతిరావు ఆధ్వర్యంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేశారు. రక్షితమంచినీటి పథకం వద్ద పేరుకు పోయిన పిచ్చిమొక్కలు, చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. అలాగే తాగునీటి ట్యాంకును శుభ్రం చేశారు. గ్రామ సచివాలయం సమీపంలో మురుగు నీటి కాలువలో పూడిక, చెత్తను తొలగించారు.

నగర సంకీర్తన



నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

శృంగవరపుకోట: సత్యసాయిబాబా అవతార ప్రకటన దినోత్సవాన్ని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ పి.కేశవరావు నేతృత్వంలో పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పుణ్యగిరి రోడ్డులో సత్యసాయి మందిరంలో సత్యసాయికి ప్రత్యేక పూజలు చేశారు.. అనంతరం పట్టణంలో పలువురు సత్యసాయి భక్తులు, మహిళలు స్వామి చిత్రపటంతో నగరసంకీర్తన చేశారు. సత్యసాయి భజన గీతాలతో పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

శ్రమదానం



ఆర్‌ఓబీపై పిచ్చిమొక్కలు తొలగిస్తున్న యువకులు

జామి: మండలంలోని భీమసింగిలో భార్గవ్ హెల్ప్‌లైన్ సంస్థ వ్యవస్థాపకుడు కె.వి.రమణ ఆధ్వర్యంలో యువకులు శ్రమదానం చేశారు.ఆర్ఓబీపై పిచ్చి మొక్కలు,మట్టి, చెత్తను తొలగించారు. ఈసందర్భంగా కె.వి. రమణ మాట్లాడుతూ పిచ్చి మొక్కలు,చెత్త, మట్టి పేరుకుపోవడంతో వంతెన పాడైపోతోందని, వర్షపు నీరు నిలిచిపోతుండడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. అందుకే యువకులతో కలిసి శ్రమదానం చేసి వాటిని తొలగించామని చెప్పారు.

నూతన దంపతులకు ఆశీర్వాదం



ఆతవలో నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కడుబండి

వేపాడ: మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం జరిగిన శుభకార్యక్రమాలకు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఆతవలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త లెంక కోటేశ్వరరావు కుమారుడి వివాహం జరిగింది. వధూవరులను జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు నెక్కల నాయుడు, ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జగ్గుబాబు, తదితరులు పాల్గొన్నారు.